అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోండి

● అధికారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి సూచన

సరూర్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఆ దిశలో అధికారులు చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆమె మీర్‌పేట్ మంత్రాలచెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులతో పాటు పెద్దచెరువు వద్ద జరుగుతున్న క్రీడా ప్రాంగణం పనులను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎక్కడా కూడా నాణ్యతాలోపాలు తలెత్తకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయొద్దని, ప్రజాభివృద్ధి కోసం కేటాయించిన నిధులతో పనులను నాణ్యతగా చేపట్టాలని అన్నారు. అధికారులు ఆయా పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, కాంట్రాక్టర్లపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్, రాజ్‌కుమార్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ సహకార సంఘం పాలకవర్గం సభ్యులతో ఒడిశా సహకార సంఘాల చైర్మన్లు

తుర్కయంజాల్ సహకార సంఘాన్ని సందర్శించిన ఒడిశా బృందం

హయత్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సహకార పర్యటనలో భాగంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన రైడి జిల్లాలోని 15 రైతు సంఘాలు(పీఏసీఎస్) చైర్మన్లు, ఉపాధ్యక్షులు, పాలకవర్గం సభ్యుల బృందం గురువారం తుర్కయంజాల్‌లోని రైతుసేవా సహకార సంఘాన్ని సందర్శించింది. సహకార సంఘం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, సొసైటీ సీఈవో రాందాసు పాల్గొన్నారు.



కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

కాలనీల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి కృషిచేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సౌభాగ్యనగర్, మహాలక్ష్మీనగర్, బృందావన్ మెడోస్ కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీ ముఖద్వారాన్ని కార్పొరేటర్ గురువారం ప్రారంభించారు. కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్‌కుమార్, యాదయ్యగౌడ్, నందకిషోర్, విష్ణు, విద్యారెడ్డి, ఆంజనేయులు, మురళి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన సదస్సు

సైదాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలనీలో పౌరహక్కుల అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సర్కిల్-7 డిప్యూటీ కమిషనర్ శైలజ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ ఐఎస్‌సదన్ డివిజన్ అధ్యక్షుడు దాస్, సీపీఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, మాజీ వార్డు కమిటీ సభ్యుడు ఎడవెల్లి నర్సింహ, శంకర్‌నాయక్, ఈశ్వర్‌మాదిగ, శంకర్ పాల్గొన్నారు.

బహుళ ఔషధ చికిత్సతో కుష్ఠువ్యాధి నయం



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సద్గుణాచారి

మన్సూరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మానవాళిని పట్టిపీడించే కుష్ఠువ్యాధిని సరైన అవగాహన, బహుళ ఔషధ చికిత్సతో నయం చేయొచ్చునని రిటైర్డ్ పారా మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సద్గుణాచారి తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని లయోల హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం కుష్ఠువ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని ప్రారంభించి విద్యార్థులకు వ్యాధి పట్ల అవగాహనను కల్పించారు. కార్యక్రమంలో లయోల స్కూల్ యజమాని గుల్షన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్ : 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను దివ్యాంగుల రుణాలు పొందేందుకు రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి సీహెచ్ సంధ్యారాణి కోరారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగుల ఫిబ్రవరి 2వ తేదీలోపు తగిన వివరాలతో టీఎస్‌ఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూసారాంబాగ్‌లో హెల్మెట్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీవో కిష్టయ్య

చాదర్‌ఘాట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మలక్‌పేట ఆర్టీఏ ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ మూసారాంబాగ్‌లో హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ఈస్ట్‌జోన్ ఆర్టీవో ఎల్.కిష్టయ్య జెండా ఊపి హెల్మెట్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం ద్వారా అనుకోకుండా జరిగే రోడ్డు ప్రమాదాలతో తలకు గాయాలు కాకుండా జాగ్రత్త పడేందుకు అవకాశముందన్నారు. మన కుటుంబానికి మన ప్రాణాలు ముఖ్యమనే విషయాన్ని ద్విచక్రవాహనదారులు గుర్తించి బాధ్యతగా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మలక్‌పేట ఆర్టీఏ కార్యాలయం నుంచి మూసారాంబాగ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐలు బలరాం, రాధిక, నరేంద్రపాల్‌సింగ్, రమేష్‌బాబు, ఏఎంవీఐలు రజిని, అశ్రఫ్‌ఖాన్, మధుసూదన్‌రెడ్డి, జాన్, ఏవోలు ప్రవీణ్‌కుమార్, అంజుమ్, మధుకర్ పాల్గొన్నారు.



విజయపురికాలనీ ఫేజ్-1లోని గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



బీఆర్ఎస్ నాయకులతో కలిసి తన నివాసంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయించాలంటూ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహాత్మాగాంధీకి ఘన నివాళి



చంపాపేటలో జాతిపిత గాంధీకి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి తదితరులు

మన్సూరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని ఎల్బీనగర్, మలక్‌పేట్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధుల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలోని మహాత్ముడి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు పాల్గొన్నారు.

మళ్లీ పుట్టండి మహాత్మా..! : ఎమ్మెల్యే సబితారెడ్డి

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి సర్ది చెప్పేందుకు 'మహాత్మా.. మీరు మళ్లీ పుట్టండి' అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి కోరారు. ఈ మేరకు సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆయన విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లోకసాని కొండల్‌రెడ్డి, దర్పల్లి అశోక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సుశీలారెడ్డి, ఇస్మాయిల్, మురుకుంట్ల అరవింద్, గౌని శ్రీనివాస్‌గౌడ్, నగేష్, సాజిద్, రాజేష్ గౌడ్, కొండా గిరిగౌడ్, వుత్తుపల్లి శ్రీనివాస్, రిషి సాదిక్, పుట్టం విజయ్ పాల్గొన్నారు.

చంపాపేట: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కాంగ్రెస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. చంపాపేటలోని గాంధీచౌరస్తా, కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజీలోని గాంధీ విగ్రహాలను శ్రీపాల్‌రెడ్డితో పాటు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో తోకటి కిరణ్, బద్రీ, విశ్వనాథ్, రణధీర్ రెడ్డి, అనసూయ, చింటూ, భగవాన్‌జీ పాల్గొన్నారు.

నేటి నుంచి జ్ఞానసరస్వతి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు

మన్సూరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నంబర్.1లోని జ్ఞాన సరస్వతి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వరప్రసాద్, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ట్రెజరర్ రాములు తెలిపారు. ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయం స్థాపించి పుష్కరకాలం అయిన సందర్భంగా రూ.20లక్షల అంచనా వ్యయంతో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుతున్నామన్నారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో సంజీవ రెడ్డి, ఆలయ ఉపాధ్యక్షులు ఆనంద్‌రావు, లక్ష్మయ్య, దయానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్రసాయి, సలహాదారులు రమణయ్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలకు సిద్ధమైన జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జ్ఞానసరస్వతి ఆలయ కమిటీ సభ్యులు



బడంగ్‌పేట్‌లో గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేసి నివాళులర్పిస్తున్న రాంరెడ్డి తదితరులు

మహాత్మా.. ప్రభుత్వం కళ్లు తెరిపించు..

● గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేసిన బీఆర్ఎస్ నేతలు

సరూర్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం 420 రోజుల్లో 420 అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టిందని, 420 హామీలు అమలు చేసేలా రేవంత్‌కు బుద్ధి ప్రసాదించండి అని వేడుకుంటూ బీఆర్ఎస్ నేతలు గాంధీ జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి, చిత్రపటానికి వినతిపత్రాలు అందజేశారు. బడంగ్‌పేట్‌లో పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో, మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీజీ వర్ధంతి వేడుకల్లో భాగంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేస్తూ గాంధీజీ చిత్రపటానికి, విగ్రహానికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవిహారం పుస్తక కేంద్రం ప్రారంభం



విజయవిహారం రమణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విజయవిహారం పత్రిక ప్రారంభమై 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎల్బీనగర్‌లోని ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ భవన్‌లో విజయవిహారం పుస్తక కేంద్రాన్ని ప్రారంభించారు. జైభారత్ ఉద్యమ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోకనాథ్, ఏపీ అధ్యక్షుడు ఖదిజ్ఞాసి అరవిన్సరాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పత్రికా సంపాదకులు రమణమూర్తి మాట్లాడుతూ పుస్తక కేంద్రంలో పాత సంచికలతో పాటు జైభారత్ పబ్లికేషన్స్‌కు సంబంధించిన పుస్తకాలు సైతం ఉంటాయన్నారు. అనంతరం పత్రికా సంపాదకులు, మేధావులను సన్మానించారు. కార్యక్రమంలో సోషలిస్టు మేధావి రామదాసు, దళిత్ కమెండో పత్రికా సంపాదకులు పిల్లి డేవిడ్‌కుమార్, జైభారత్ ఉద్యమ జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, రాష్ట్ర అధ్యక్షుడు గోల సత్యనారాయణ, నాయకులు మల్లికా వల్లభ, శేషు, జీవీ రమణ, త్రిమూర్తులు, జీవన్ జోయెల్, వీరన్న, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

5శాతం రిజర్వేషన్లపై హర్షం

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో వికలాంగ విద్యార్థులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేయడం పట్ల వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా గరిష్ఠ వయోపరిమితిలో కూడా ఐదేళ్ల మినహాయింపు కల్పించిందని ఈ మేరకు ప్రభుత్వం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా వికలాంగుల చట్టంలో ఉన్న నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ మోహన్‌నగర్, లెక్చరర్స్‌కాలనీ, మదర్‌డైరీ, లక్ష్మీనగర్, ఫణిగిరికాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణపనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. మోహన్‌నగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, లెక్చరర్స్‌కాలనీ, మదర్ డైరీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, లక్ష్మీనగర్, ఫణిగిరికాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

చంపాపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

చంపాపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌వాల్యా 11కేవీ పరిధిలో వివిధ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ కె.శ్రీనివాస్ తెలిపారు. చంపాపేట మజీద్, సుల్తాన్‌వాల్యా, కటికోని కుంట, సాయిరాంనగర్‌కాలనీ, భారత్ పెట్రోల్ పంప్ మేయిన్ రోడ్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

'118 జీవో' లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించండి

వనస్థలిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో 118 జీవో కన్వెయన్స్ డీడ్ పొందిన లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంబంధిత కాలనీవాసులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరారు. గురువారం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైదేహినగర్ నార్త్ కాలనీ అధ్యక్షుడు పోగుల రాంబాబు కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు 118జీవో కన్వెయన్స్ డీడ్ పొందిన లబ్ధిదారులు ఇంటి పన్నుతో పాటు వేకెట్ ల్యాండ్ టాక్స్‌ల నోటీసులు కూడా రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే సంబంధిత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ అధికారులతో ఫోన్లో మాట్లాడి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. 118 జీవో లబ్ధిదారులకు కేవలం ఇంటి పన్ను మాత్రమే వచ్చే విధంగా తగుచర్యలు చేపట్టి, వేకెట్ ల్యాండ్ టాక్స్ రాకుండా సదరు సైట్‌లో దానిని తొలగించాలని ఆదేశించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

'పల్లవి'లో విజయవంతంగా కార్నివాల్



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఎల్బీనగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సాగర్ రోడ్డులోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన కార్నివాల్ విజయవంతంగా బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమం స్వర్ణిమ్ భారత్ నేపథ్యంలో భారతదేశ గొప్ప వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఒకచోట చేర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. కార్నివాల్‌లో ఇంటర్ స్కూల్ డ్యాన్స్ పోటీల్లో రీజియన్‌లోని 18 పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ నృత్య కళాకారిణి, నటి, టెలివిజన్ హోస్ట్ ఆశ్రిత వేముగంటి నండూరి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శాస్త్రీయ నృత్యంతో అతిథులకు స్వాగతం పలికారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు, చదువుల ప్రాముఖ్యతను వివరించారు. కార్నివాల్‌లో వాస్తు ఫైనాన్స్, కియోమోటర్స్, మారుతి, డెక్కన్ హోండా, డెకాథ్లాన్ వంటి ప్రముఖ బ్రాండ్‌లు, అనేక ప్రముఖ నగలు, దుస్తుల కంపెనీలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ప్రధానోపాధ్యాయురాలు నీలం విజేతలను ప్రకటించారు. నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మొదటి స్థానంలో నిలిచి 10వేల నగదు బహుమతి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మహేంద్రహిల్స్ రెండవ స్థానం సాధించి 5వేల నగదు, హెచ్ఆర్డీ స్కూల్ తృతీయ స్థానంలో నిలిచి మూడు వేల రూపాయల బహుమతి సాధించింది.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులు

రజక వృత్తిదారుల సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య 2025 ఏడాది నూతన క్యాలెండర్‌ను గురువారం కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలన్నారు. 55 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు ప్రతి నెల 5వేల పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రజక ఫెడరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. ధోబీఘాట్లకు స్థలాలను కేటాయించి నిర్మాణాలు చేపట్టి అక్కడ మౌలికవసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కేతరాజు నర్సింహ, నాంపల్లి నరేందర్, గణేష్, స్వాతి, రవి, భాను, నర్సింహ, లలిత పాల్గొన్నారు.



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

మీర్‌పేట్ భాష్యంలో ఇంట్రాజోన్ స్పోర్ట్స్ మీట్

సరూర్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని భాష్యం హైస్కూల్ గ్రౌండ్‌లో 29,30 తేదీల్లో నిర్వహించిన ఇంట్రాజోన్ స్పోర్ట్స్ మీట్ గురువారంతో ముగిసింది. జోన్-3కి చెందిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ఈ కార్యక్రమం సందడిగా కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షటిల్ తదితర క్రీడలను నిర్వహించగా, పలు బ్రాంచీలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఆయా అంశాల్లోని విజేతలకు భాష్యం చైర్మన్ రామకృష్ణ, సీఈవో చైతన్య, జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, శృతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరం

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 80మంది మద్యం ప్రియులకు 80మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో గురువారం 4విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను గుర్తుంచుకోవాలని, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని అన్నారు. రాచకొండ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారి వీడియో క్లిప్స్, ప్రముఖుల సందేశాలు, మద్యంమత్తు అనర్థాలకు అద్దంపట్టే పాటలనూ ప్రదర్శించారు. అనంతరం విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్ రెడ్డి, ఎస్ఓపీ అల్లూరయ్య కౌన్సెలింగ్/ వాహనాల తనిఖీల ప్రాధాన్యతనూ వివరించారు. టీటీఐ సిబ్బంది రమేష్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలూ ప్రదర్శించారు.



డీడీ కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సురక్షిత వాహన ప్రయాణం అందరికీ అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఎస్ఐ ఎస్.నర్సింహారావు, ఏఎస్ఐపీ సోమనాథం సూచించారు. గురువారం వారు కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ కేర్ నర్సింగ్ హోమ్, తదితర 10 ప్రాంతాల్లో నిబంధలను వాహనాల డ్రైవర్లకు, యజమానులకు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు, సూచనలు, రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యత, మద్యం మత్తులో వాహనాలు నడిపితే అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన కోసం తయారు చేసిన కరపత్రాలను 762 మందికి పంపిణీ చేశారు.